కథ

# సంసారంలో సరిగమలు

-వేలూరి మునుస్వామి

**భార్య ఒంటిపై చెయ్యేశాడు రఘు.**

**"పిల్లాడు పక్కనే ఉన్నాడు. మీకు సిగ్గు లేదు సరే. నేను ఆడదాన్నండీ!'**

**అంటూ అతని చేతిని విసిరి కొట్టిందామె.**

**"అలాగనుకుంటే పక్కగదిలోకెళ్తేసరి! లేమరి...' రఘు ఉడుకులో ఉన్నాడు.**

'నా దగ్గర మీపప్పులేమీ ఉడకవ్! పడుకోండి...' కసిరింది కస్తూరి.

ఆలోచనలో పడ్డాడు రఘు.

పొద్దున్నే పుట్టింటికెళ్ళి అక్కడ పదిరోజుల పాటు గడిపిరావాలనుకున్నట్లుగా ప్రపోజల్ లేవనెత్తింది.

అందుకు తను ససేమి రా ఒప్పుకోకపోగా, 'ఇక్కడ తిండీ తిప్పలకు నేను అవస్థలు పడాలి. హోటల్లో తింటేనాకు పడదని సంగతి నీకు తెలిసిందే! మీ చెల్లెలి పెళ్ళికో, మీ నాన్నకు ఒంట్లో బావుండకో వెళ్ళినా అర్థముంది. ఆ కారణంగా నన్ను ఇబ్బందుల్లో పడేయడానికి కాకుంటే ఏమిటిది..'

ఇలా తిరస్కారానికి తను సవాలక్ష కారణాలు చూపాడు.

'మా అమ్మ వరుసగా రాత్రులు కలలో కనిపిస్తూందండీ! ఆమెకేమైనా ఒంట్లో నలతగా ఉందేమో? ఎంతసేపూ మీ బాధలు ఏకరవు పెడతారేకానీ అవతలివారిని అర్థం చేసుకోరేం...'

ఆమె వాదన సబబైనా తేలిగ్గా తనులొంగదలుచుకోలేదు.

'మీ అమ్మకంత సీరియస్ అనిపిస్తే ఏ టెలిగ్రామో రాకుండా ఉంటుందా? అప్పుడెటూ ప్రయాణం కట్టక తప్పదు...'

ఈ ప్రస్తావన ఇంతటితో ఆపు అన్నట్లుగా అవతలికి నడిచాడు.

ఒకవేళ ఆ నెపంతోనే ఇప్పుడు దరిచేరనీయడం లేదా?

'ఏమిటలా మిడిగుడ్లేసి చూస్తున్నారు? నవ్వుతూ పలకరించింది కస్తూరి.



'ఆ... అహ్హా! ఏదోగుర్తుకొస్తేను...' తన ఆత్మగౌరవం దెబ్బతినకూడదని మాటదాటేయ చూశాడు రఘు.

'మీ మనోభావాలు చదవగలిగే శక్తి నాకూ ఉందిలెండి! అలాంటి ఆపోహలేమీ పెట్టుకోకండి! మీరటు వీధిలోకెళ్ళాక మా పుట్టింటినుంచి ఉత్తరం వచ్చింది. అక్కడంతా క్షేమమని. నా మనసు కుదుట

పడింది. మీరు వెళ్ళమన్నా వెళ్ళే స్థితిలో లేనిప్పుడు. అదిగో... మళ్ళీ చెయ్యేస్తున్నారు. నిజమే చెప్తున్నాను. నా మాటనమ్మండీ! మీపై నాకేం కోపం లేదు. రేపటికి చూసుకుందాం. ఇప్పటికి బుద్ధిగా పడుకోండి! ఏదీస్వీటు... మీ తృప్తికైనా తింటాను...' ఆ ప్రోగ్రాం వేసుకొన్నప్పుడు స్వీట్ పొట్లాంతో రెడీ అవుతాడు రఘు.

భార్య సహకారం లేకపోయేసరికి బలవంతం చేసినా అందులో రంజు కనిపించదని ఇక చేసేదేం లేక నిట్టూరుస్తూ స్వీట్ పొట్లాంకోసం చేయి చాచాడు.

అది పెట్టిన చోట కనిపిస్తేనా?

కొడుకు వందన్ నిద్రపోయాడనే ధీమాతో భార్యతో సరసాలాడ్తూ ఆదిలోనే తను తెచ్చిన స్వీట్ తినమన్నాడు.

'దీని వెనుక స్వార్థం నాకు తెలియకుంటే కదా? ఓపికలేదు బాబూ! మీరే తినండి. జోడు గుర్రాల మీదుంటారెప్పుడూ...' అంటూ ఆమె తీసుకోలేదు.

'అబ్బ! అందుకోసం కాదులే... నీ కిష్టవనీ తెచ్చాను! ఏమ్మా... అంతకష్టమేం చేశావు? ఓపికలేకుండడానికీ...'

'అందుక్కాదంటూనే ఆరాలా...'

ఇద్దరూ వాదోపవాదాల్లో ఉండగా దొంగ నిద్రలో ఉన్న వందన్ మెల్లగా కళ్ళు తెరిచి చూశాడు.

తల్లితండ్రులు వీపు చూపిస్తూ అటుమళ్ళున్నారు. వారి మధ్యన మిఠాయిపొట్లాం ఉంది.

అదే అదనని పొట్లం విప్పి శుభ్రంగా తినేసి మూతి తుడుచు కుంటున్న సమయాన్నే తండ్రి కంటపడ్డాడు.

'ఓరిగాడుగ్గాయి! నువ్వింకా నిద్రపోలేదా? మీ అమ్మకోసం మిఠాయి తెస్తే మొత్తం తినెయ్యడమేనా...' భర్త అవస్థకు ముసిముసిగా నవ్వుకుంటూ, కొడుకును వెనుకేసుకొచ్చింది కస్తూరి.

'పోనీలెండి! పసిపిల్లాడు. తింటేతిన్నాడు. కన్నా! నువ్వెళ్ళి మంచినీళ్ళు తాగమ్మా! లేకుంటే గొంతుపట్టుకుంటుంది.'

తలూపి చాపమీద నుండి లేచి వెళ్తున్న పొట్టిబుడంకాయ్ కేసి విడ్డూరంగా చూస్తూ అన్నాడు రఘు.

'వేలెడంత లేదు. వీడి తెలివి తేటలు చూడు! మనంమాటల్లో ఉండడం వీలు చూసుకొని గుట్టుచప్పుడు కాకుండా పనికానిచ్చాడు...

'చిన్నప్పుడు మనమూ అలాగే చేసుంటాంలెండి! ఇప్పుడు సరే పెద్దవాళ్ళమయ్యాం! నీతులెన్నైనా మాట్లాడొచ్చు...' భార్యమాట్లాడ్తుంటే మరినోరెత్తలేదు రఘు.

మంచినీళ్ళు తాగొచ్చి పడుకున్న వందన్ తొమ్మిదేళ్ళ చిన్నిబుఱ్ఱలో ఓ ధర్మసందేహం తొణికిసలాడింది.

తను అన్నంకానీ, మరే చిరుతిండి కానీ తిననని మొరాయిస్తుంటే,

'తినువందన్! నా బుజ్జివి కదూ...' అంటూ బ్రతిమిలాడే తల్లితో...

'ఇప్పట్నుంచే వాడికెందుకు గారాబం చేసి పాడుచేస్తావ్? ఆకలైతే వాడే తింటాడులే..' అని కసురుకునే తండ్రి...

ఇప్పుడేమో అదేదో కావాలని తల్లినెంతో బ్రతిమిలాడ్తున్నాడు... తనను మించి మారాం చేస్తున్నాడు... దీని భావమేమి తిరుమలేశా!?

పసితనంలో అపరిపక్వ మనసుతో మనం మాత్రం ఎన్ని అనుకోలేదు?

ఎన్నిటికి విస్మయం చెందలేదు? పెరిగి పెద్దయి పెళ్ళి చేసుకొని భార్యతో వేగుతూంటే ఆటోమేటిగ్గా అన్నీ అరటిపండు ఒలిచిపెట్టినట్లు విశదమవుతాయా!?

వందన్ సందేహనివృత్తి... అంతేమరి!!

❀ ❀ ❀



## ఆరోగ్య రక్షణ

రోజురోజుకూ పెరిగిపోతున్న వాతావరణ కాలుష్య పరిరక్షణ కోసం ఉద్యమించారు కొందరు ఔత్సాహికులు. గాలి కాలుష్యం నుంచి రక్షించు కోవటానికి గ్యాస్ మాస్కులు ధరించాలని కోరుతున్నారు. వారి ఉద్దేశ్యం ప్రజలకు తెలియ జేయటానికి సియోల్‌లో ఉన్న పదహారవ శతాబ్దంలో జప్పాన్‌కి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అడ్మిరల్ లీ విగ్రహానికి గ్యాస్ మాస్క్ తొడిగి, తమ ఉద్దేశ్యాన్ని ప్రజలకు తెలియజేశారు.

-డి.వి.ఎల్.నరేంద్ర

